
గరుడ సేవలో టిటిడి ఛైర్మన్

వేడుకగా గరుడసేవ

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఉదయం మోహినీ అలంకారంలోనూ, రాత్రి గరుడవాహనంపైనా మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడసేవకు లక్షల్లో భక్తులు వస్తారని అనుకున్నా ఆశించిన స్థాయిలో రాలేదన్న చర్చ నడిచింది. ఎక్కువగా తమిళ భక్తులు, తిరుపతి స్థానికులతోనే గరుడసేవ సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు యానాదయ్య, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహ కిషోర్ పాల్గొన్నారు.

వాహనబేరర్లకు పంచెలు పంపిణీ

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న వాహనబేరర్లు, మేళం సిబ్బందికి శుక్రవారం తమిళనాడుకు చెందిన దాత తంగదొరై రెండు లక్షల విలువైన 120 పంచెలను బహుమానంగా అందించారు. ఉదయం పల్లకీ ఉత్సవం అనంతరం వైభవోత్సవ మండపంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి చేతుల మీదుగా దాత ఈ పంచెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

భక్తుల సదుపాయాలు పరిశీలన

గరుడసేవను చూడటానికి తిరుమల నాలుగు మాడ వీధుల్లో వేచి ఉన్న భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను ఈవో ఎవి ధర్మారెడ్డితో కలిసి టిటిడి ఛైర్మన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. భక్తులకు చేసిన ఏర్పాట్లు, ఆహారం పాలు, కాఫీ, టీ, తాగునీరు అందుతున్నాయా అని గ్యాలరీల్లోని భక్తులతో మాట్లాడారు. గ్యాలరీలో వేచి ఉండే ప్రతి భక్తునికీ గరుడ వాహనంపై ఉన్న మలయప్పస్వామివారి దర్శనం చేయించిన తరువాతే స్వామివారు ఆలయానికి వేంచేస్తారని తెలిపారు. దాదాపు 1500 మంది శ్రీవారి సేవకులు భక్తులకు సేవలు అందిస్తున్నారు.

భక్తుల కోసం అన్నప్రసాదాలు

భక్తుల కోసం ఉదయం 5 నుండి 6 గంటల మధ్య పాలు, కాఫీ, ఉదయం 6.30 నుండి 8 గంటల మధ్య ఉప్మా, పొంగలి పంపిణీ చేశారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు సాంబార్ అన్నం, టమాటా అన్నం, స్వీట్ పొంగల్ అందించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి దాదాపు 3 గంటల వరకు భక్తులకు రెండు లక్షలకు పైగా పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం సుండల్, కాఫీ, పాలు పంపిణీ చేశారు. సాయంత్రం 7 గంటలకు గరుడవాహనం ప్రారంభం కానుండగా ఉత్తర, తూర్పు మాడ వీధుల్లో సాయంత్రం 6 గంటల వరకు వెజిటబుల్ కిచిడీ పంపిణీ చేశారు.

అధికారులకు అభినందనలు

టీటీడీ జెఈవో వీరబ్రహ్మం ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎఫ్ఏసీఏవో బాలాజి, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు మాడ వీధుల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించేందుకు విధులు అప్పగించిన సీనియర్ అధికారులను టీటీడీ ఛైర్మన్, ఈవో అభినందించారు.

కళారూపాలు

మోహినీ అవతారంలో..

కళారూపాలు

కాణిపాకం పురవీధుల్లో శేషవాహనంపై విహారం

శేష వాహనంపై విఘ్నేశ్వరుడి విహారం

ప్రజాశక్తి -కాణిపాకం (ఐరాల)

ప్రముఖ పుణ్యక్షేత్రం కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం స్వామివారు శేష వాహనంపై విహరించి కాణిపాకం పురవీధులలో ఊరేగుతూ భక్తులను అలరించారు . స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శేష వాహనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవ ఉభయదారులైన. కాణిపాకం ,కాకర్లవారి పల్లె. వడ్రంపల్లె. ,మిట్ట ఇండ్లు. కొత్తపల్లె. అడప గుండ్ల పల్లె. బొమ్మ సముద్రం. తిరువనం పల్లె. చిగరపల్లె. అగరంపల్లె. వంటి గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు. ఉభయదారులుగా వ్యవహరించారు ఈ మేరకు వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ అర్చక స్వాములు వేద పండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూలవిరాట్ కు వివిధ రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే స్వామి వారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మరో మారు ధూప దీప నైవేద్యాలు సమర్పించి. అనంతరం వివిధ రకాల సుగంధ పరిమళ పుష్పాలు తో అలంకరించిన శేష వాహనంపై స్వామి అమ్మవార్లను ఉంచి కాణిపాకం పురవీధులలో ఘనంగా ఊరేగించారు ఈ సందర్భంగా భక్తులు నారికేల కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి. ఆలయ ఈవో వెంకటేశు. ఈ ఈ వెంకటనారాయణ. ఏఈ ఓలు విద్యాసాగర్ రెడ్డి. ఎస్ వి కష్ణారెడ్డి. రవీంద్రబాబు. హేమమాలిని. హరి మాధవరెడ్డి. సూపర్డెంట్లు శ్రీధర్ బాబు. కోదండపాణి. టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాబు. సురేష్. స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

'జగనన్నకు చెబుదాం' వినియోగించుకోండి : జేసీ

ప్రజాశక్తి - గుడిపాల

ప్రతి మంగళ, శుక్రవారాల్లో మండలాల్లో జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యేందుకు చేపట్టిందని, దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని జేసీ పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం గుడిపాల మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం జరిగింది. మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, కొన్ని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్‌ఛైర్‌పర్సన్ రమ్య, జడ్‌పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు తులసి, గంగాభవాని పాల్గొన్నారు.

రెచ్చగొడితే రావణకాష్టమే...: టిడిపి

శ్రీకాళహస్తిలో నిరసన దీక్ష

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని టీడీపీ మహిళా విభాగం నాయకులు విమర్శించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శుక్రవారం తెలుగు మహిళలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రావణుడులాంటి జగన్, రాముడు లాంటి చంద్రబాబును జైల్లో పెట్టడం బాధాకరమన్నారు. ఆయన్ని బేషరుతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చక్రాల ఉష, కష్ణవేణి, సుమతి, సుభాషిణి, విజయ్ కుమార్, దసరథ ఆచారి, గురువారెడ్డి, ఎస్సీవీ దిలీప్, చెంచయ్య నాయుడు, గాలి మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు మండలాధ్యక్షులు గాలి మురళీనాయుడు ఆధ్వర్యంలో చిన్న సింగమల వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గూడూరులో.. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అసనాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆధారాలు లేకుండా నారా చంద్రబాబును అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్, దావూద్, శంకర్, ధనుష్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో చేస్తున్న రిలే దీక్ష 10వ రోజు కుటుంబసభ్యులతో కలిసి జరిగింది. మాజీ శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

గంగవరంలో... ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పాదయాత్రగా కీలపట్లలోని కోనేటిరాయస్వామి ఆలయం వరకూ వెళ్లారు. వెంకటేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి వెంటనే విడుదల కావాలని టెంకాయలు కొట్టి స్వామివారిని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్‌గౌడ్, ఆర్బీసీ కుట్టి, నాగరాజు పాల్గొన్నారు. **గుడిపల్లిలో...** మాజీ జడ్‌పిటిసి బెటప్పనాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అగరం సర్పంచి గోపాల్, మంజునాథ్, గోవిందస్వామి పాల్గొన్నారు.

కార్యకర్త గుండెపోటుతో మృతి

పుంగనూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ రాలేదనే తీవ్ర మనోవేదనకు గురై గురువారం గుండెపోటుతో మతి చెందాడు. మండలంలోని చంద్రమాకులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఒంటిమిట్ట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త శ్రీనివాసులు నాయుడు చంద్రబాబును అక్రమ కేసులతో జైల్లో పెట్టి హింసకు గురి చేస్తున్నారని మనోవేదన గురి కావడంతో గుండెపోటు వచ్చి మతి చెందాడు. కార్యకర్త మరణం గురించి తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియ రెడ్డి, సోదరి వీణారెడ్డి మతుని ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కుటుంబానికి ధైర్యం చెబుతూ..

కొనసాగుతున్న డెయిరీ కార్మికుల దీక్షలు

చిత్తూరుఅర్బన్: సహకార విజయడెయిరీలో పని చేసి విఆర్ఎస్ తీసుకొన్న కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక రెడ్డిగుంట వద్ద ఉన్న అమూల్ డెయిరీ ఎదుట కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి పదో రోజుకు చేరుకుంది. తమకు చట్టపరంగా అందాల్సిన జీతాలు చెల్లించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షా శిబిరాన్ని గురువారం పోలీసులు, రెవిన్యూ అధికారులు బలవంతంగా తొలగించారు. దీక్షా శిబిరాన్ని తొలగించినా కార్మికులు రిలే దీక్షను కొనసాగిస్తున్నారు. పోలీసులు, రెవిన్యూ అధికారులు, కో ఆపరేటివ్ సహకార సంస్థ అధికారులు కార్మికులను బెదిరింపుకలు గురి చేస్తూ దీక్షా శిబిరాన్ని బలవంతంగా తొలగించడం పట్ల కార్మిక సంఘం నాయకులు కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన జీతాలపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విజయ సహకార డెయిరీ కార్మికుల యూనియన్ నాయకులు కుమార్ శుక్రవారం అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పదో రోజు కొనసాగుతున్న డెయిరీ కార్మికుల దీక్ష

ఎరువులు ఎక్కువగా వాడొద్దు : ఎడిఎ

ప్రజాశక్తి - వెంకటగిరి

'ఎరువులు ఎక్కువగా వేస్తే ఆదాయం ఎక్కువ వస్తుందనేది పూర్తిగా అపోహ, ఖర్చు ఎక్కువై అన్నదాతకు ఆదాయం తగ్గుతుంది' అని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఎడిఎ మెరుగు భాస్కరయ్య తెలిపారు. ఆత్మ సహకారంతో వెంకటగిరి మండలం పారవోలు గ్రామంలో వరి సాగుపై ఆయన రైతులకు శిక్షణ ఇచ్చారు. వరికి యూరియా ఎక్కువగా వేస్తే చీడ బెడద ఎక్కువవుతుందన్నారు. భూమిలో భాస్వరం నిల్వలుపెరిగితే జింక్ పోషకం పైరుకు అందదని తెలిపారు. దీనివలన రైతుకు ఖర్చు పెరగడం తప్ప లాభం ఏమీ ఉండదని చెప్పారు. వరికి దుక్కిలో, చిరు పొట్ట దశలో 20 కిలోల చొప్పున పొటాష్ వేస్తే చీడల సమస్య తగ్గి, ధాన్యం నాణ్యంగా ఉంటుందని చెప్పారు. ఎఒ వేణుగోపాలరావు రబీ కాలంలో సాగుకు అనువైన వరి రకాలు, నారు పెంపకంలో మెళకువలు, కలుపు నిఆరణ గురించి వివరించారు. రబీలో పంటల సాగుకు అవసరమైన ఎరువులను ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచుతామని, వీటిని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుజాత కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు శివ పాల్గొన్నారు.


అన్నదాతలకు అవగాహన కల్పిస్తూ...

విద్యార్థులతో పనులు చేయించొద్దు : డిఇఒ

ప్రజాశక్తి - బాలాయపల్లి

విద్యార్థులకు చదువు చెప్పాలే కానీ, వారితో పనులు చేయించడం తగదని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు లేకపోతే ఆయా, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో తెప్పించుకోవాలే తప్ప, విద్యార్థులతో ఎలా తెప్పిస్తారని మండిపడ్డారు. ఏమన్నా జరిగితే మీరు బాధ్యులవుతారా అని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయునిపై మండిపడ్డారు. పదో తరగతి సిలబస్ ఎంతవరకు అయ్యిందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ కల్లా సిలబస్ పూర్తి చేసి, అప్పటినుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించి, అదనపు తరగతులు తీసుకుని, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు తయారు చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

డిఇఒ ఆకస్మిక తనిఖీ

క్యాన్సర్ నివారణలో ఇమ్యునోథెరపీ కీలకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రానున్న రోజుల్లో క్యాన్సర్ నివారణలో అమ్యునో థెరపీ కీలకపాత్ర పోషించనుందని డాక్టర్‌విజయ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. స్విమ్స్ పాథాలజీ విభాగం ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో అతిథి ఉపన్యాసం విజయవంతంగా సాగింది. ఈ దిశగా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు విస్తృతస్థాయిలో జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం కీమోథెరపీ, రేడియోథెరపీ, సర్జరీ ఈ మూడు ప్రక్రియలు క్యాన్సర్ చికిత్సకు అందుబాటులో ఉన్నాయన్నారు. తాజాగా ఇమ్యునోథెరపీ అందుబాటులోకి రానుందన్నారు. క్యాన్సర్ సోకిన భాగంలో ఇంజనీర్డ్ ఇమ్యూన్ సెల్స్ పాత్రపై వర్కుషాపు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఉషా కళావత్, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రుక్మాంగద పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

రేణిగుంట : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం గురజాడ జయంతి సందర్భంగా బాలికల పాఠశాలలో సభ నిర్వహించి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి కన్వీనర్ ఓ. వెంకటరమణ మాట్లాడుతూ గురజాడ రచనలు ప్రగతి బాట కాలాతీతుడని, దేశభక్తి గీతం ఉన్నతమైన భావాలతో కూడినదని, దేశమంటే మనుషులని, మత బేదాలు విడిచి పెట్టి అన్నదమ్ముల్లా కలసి వుండాలని, ఆధునిక కవిత్వం ద్వారా వాడుక భాషలో అందించారన్నారు. సంఘ సంస్కరణ, స్త్రీ చైతన్య లాంటి అనేక రచనలు చేసిన దార్శనికుడు అన్నారు. నేడు ఐక్యత, సహనం, అభ్యదయాన్ని గురజాడ దగ్గర నుంచి నేర్చుకో వలసింది అని ఆయన చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం ఉపాధ్యాయులు పాల్గొన్నారు! అనంతరం విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు.

సర్టిఫికేట్లతో విద్యార్థులు

నూతన పోలింగ్ కేంద్రాల పరిశీలన : కలెక్టర్

చిత్తూరుఅర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటు అతి ముఖ్యమైనదని, 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల మార్పు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి పరిశీలిస్తున్నామని కలెక్టర్ ఎస్. షన్మోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజక వర్గాలకు సంబంధించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, అన్ని కళాశాలలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆ విధంగా సహకరించాలని అన్నారు. జిల్లాలో 1737 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల మార్పుకు సంబంధించి 46 దరఖాస్తులు, స్థల మార్పుకు సంబంధించి 22, నూతన పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 27, తీసివేత లేదా కలపడానికి సంబంధించి 13 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎస్సీ ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు అడగడం జరిగిందని ఇందుకోసం కొన్ని దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, ఎస్ డి సి భవాని, ఆర్డీవోలు రేణుక, సుజన, శివయ్య పాల్గొన్నారు. సిపిఎం పార్టీ నుంచి గంగరాజు, సిపిఐ పార్టీ నుంచి నాగరాజన్, వైయస్సార్సీపి నుంచి ఉదయ్ కుమార్, మధు కుమార్, విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సగిలి షన్మోహన్



జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష : డిఎంహెచ్ఒ

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలందరూ ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి వారి బాగోగులు పరిశీలించాలని భావిస్తోందని, అందరూ ఇతర శాఖల వారితో సహకరించుకొని పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డా. ఓ. ప్రభావతి దేవి అన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం టి కష్ణ బాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే. నివాస్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మీద వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్యాంపుకుసంబంధించి 11 బాక్సులలో మందులు అంద జేయడం జరుగు తుందని, అవసరమైన వారికి మందులు ఇవ్వాలని మిగిలిన మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉంచాలని అన్నారు. జిల్లాలో మొత్తం 464 హెల్త్ సెంటర్లు ఉన్నాయని, 14 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయని మొత్తం 478 క్యాంపులనునిర్వహించడం జరుగు తుందని తెలిపారు. జిల్లా టీబి నివారణ అధికారి వెంకట ప్రసాద్, డి ఐ ఓ రవి రాజు, డిపిఎమ్ఓ హర్షవర్ధన్ పాల్గొన్నారు.

'నాడు-నేడు'కు నిధుల కొరత లేదు

చిత్తూరుఅర్బన్ : నాడు నేడు ద్వారా పాఠశాలలో అదనపు తరగతుల గదుల నిర్మాణ పనుల కు నిధుల కొరతలేదని, వేగంగా పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్ నందు డి ఈ ఓ.విజేయేంద్ర రావ్, పి ఓ.ఎస్ ఎస్ ఏ వెంకటరమణారెడ్డి ల తో కలసి జిల్లాలో రెండో విడతలో 1179 పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు ద్వారా అదనపు తరగతుల గదుల నిర్మాణ పనులు, జి ఈ ఆర్ సర్వే పై యం పి డి ఓ లు, యం ఈ ఓ లు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, గ్రామీణ నీటి సరఫరా ఏ ఈలు, సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డబ్బులు ఉండి ఇంకా పనులు పూర్తి చేయని అధికారుల పై చర్యలు తీసుకోవాలని యం పి డి ఒలను ఆదేశించారు. జిల్లాలో ఇంకా 1200 ల మంది బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నారని, జిల్లాలో వంద శాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జి ఈ ఆర్) సర్వే పూర్తిచేయాలని సంబందితా అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ లు జి ఈ ఆర్ సర్వే కి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిజాయితీగా సర్వే పూరి చేయుటకు విద్యా అసిస్టెంట్లతో గ్రామాలలో పరిశీలించి జీరో చేయాలన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సభ పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరుఅర్బన్: ఈనె 24న చిత్తూరు జిల్లాలో జరిగే యూటీఎఫ్ ప్రచార జాతా బైక్ ర్యాలీ , అక్టోబర్ 1న విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే యు.టి.ఎఫ్. స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకల పోస్టర్‌ను యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎం సోమ శేఖర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి రమణ, గౌరవాధ్యక్షులు పి . సుధాకర రెడ్డి, జిల్లా కార్యదర్శులు కె. రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం, పార్థసారథి, రాజేంద్ర పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో ఈ ఖరీఫ్ 2023 సీజన్ లో రైతులు సాగు చేసిన పంటలను తప్పని సరిగా ఈ నెల 25 లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని బెగ్గిలపల్లి కనమనపల్లి,కె.బి పల్లి,అగరం,పోగురుపల్లి,గ్రామ పంచాయతీలో ఈ-క్రాప్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ-క్రాప్ నమోదు వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలు నష్టపోతే పరిహారం, పంట రాయితీ పొందవచ్చని, సున్నా వడ్డీ, సబ్సిడీ పరికరాలు, ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలకు అర్హత కూడా ఉంటుందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగరాజు , రైతు భరోసా కేంద్రం ఇన్ చార్జిలు , రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఓదార్పు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మృతుని కుటుంబాన్ని గంగాధర నెల్లూరు నియోజకవర్గం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్ శుక్రవారం ఓదార్చారు. వెదురుకుప్ప మండలం ఎగువ పల్లాలు, దాసరి కాలనీ, బండి చిన్న చెల్లెమ్మ (57) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పొన్న యుగంధర్ వారి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో జనసేన మండల ఉపాధ్యక్షులు నలిపి రెడ్డి మధు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, మండల యువజన అధ్యక్షులు సతీష్, కార్వేటినగరం మండల ప్రధాన కార్యదర్శి నరేష్ ఉన్నారు.

ఉట్లుమాను విజేతకు సన్మానం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి గ్రామ పంచాయతీలో వినాయక చవితి పండుగ సందర్భంగా యూత్ ఆదిమానవులుగా మారి ఉట్లు మాను ఎక్కి 5016 రూపాయలు గెలుచు కుని మీసాల రామన్న కుమారుడు చిన్న ఎల్లప్ప విజయం సాధించారు. ఇతడిని గ్రామ పెద్దలైన గురువు రెడ్డి విఆర్వో తిమ్మారెడ్డి మోహన్ రెడ్డి, యుగంధర్ రెడ్డి అభిమానించి

కండువా కప్పి పూలమాలవేసి ఘన సత్కారం నిర్వహించారు. ఇందులో సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి ప్రెస్ రిపోర్టర్ శివకుమార్, గంగినాయన పల్లి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలోనేడు జరగబోయే వినాయక నిమజ్జనంలో అన్నదానం నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఇవో -2

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దళితవాడలోని మండల ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ2 శివ రత్నమ్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల హాజరు , ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భం గా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తూ పలువురు చిన్నా రులకు ప్రశ్నలు వేసి వారి వద్ద నుండి సమాధానాలను రాబట్టారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు.

జిపిఎస్ ఆమోదయోగ్యం కాదు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి -సోమల: రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న జిపిఎస్ అమలు ఆమోదయోగ్యం కాదని పలువురు ఉపాధ్యాయులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన రామ సముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఓపిఎస్(ఓల్డ్ పింఛన్ స్కీం) అమలు చేయాలని సిపిఎస్ రద్దుచేసి జిపిఎస్ ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈ సియస్ఏ బ్రాంచ్ లో ఓరియంటేషన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సియస్ఏ బ్రాంచ్ లో శుక్రవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా తిరుపతి ఐఐటి డిపార్టుమెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వెంకటరమణ బందార్ల హాజరై కంప్యూటర్ జనరేషన్స్, వివిధ రకాలైన కంప్యూటర్ ఛాలెంజెస్ ను విద్యార్థులకు వివరించారు. రోబోటిక్స్, డేటా ప్రాసెసింగ్, ఇండస్ట్రీ అప్లికేషన్స్, సెన్సార్, ముఖ్యంగా కంప్యూటర్ ఇంజనీర్‌కు ఉండవలసిన లక్షణాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ టీం వర్క్, ఇండస్ట్రీ ఎడ్యుకేషన్ గ్యాప్ పై విద్యార్థులకు వివరించారు. ఈ బ్రాంచ్ లో ఉండే డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు ప్రోగ్రామింగ్, లాజికల్ స్కిల్స్ నేర్చుకొని ఇండస్ట్రీకి తయారుగా ఉండాలని, రానున్న కాలంలో ఐదు బిలియన్ ఉద్యోగాలు ఎదురుచూస్తున్నాయని విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సియస్ఏ విభాగాధిపతి డాక్టర్ ఆర్ స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

29న విజయవాడలో మహా ధర్నాను జయప్రదం చేయండి

- కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి -పలమనేరు: దేశ వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్ తో గల్లీ నుండి ఢిల్లీ దాకా దళితులను చైతన్యం చేయడం లో భాగంగా కెవిపియస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వాన దళిత రక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూర్ ఈశ్వర్ ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజు తెలిపారు. పలమనేరు సిఐటియు కార్యాలయంలో శుక్రవారం మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తి అయినా కుల వివక్ష అనేక రూపాల్లో వుందన్నారు. దళిత చట్టాలను నీరుగార్చే పద్ధతిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయన్నారు. దళితులు ఐక్యంగా ఉద్యమించి దళిత చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే 41 సి ఆర్ పి సి ప్రకారం బెయిల్ ఇవ్వడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి తన మతోన్మాదపు విధానాలతో మనువాదాన్ని తిరగదోడి దళితులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు.

మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అందులో భాగంగానే అభివృద్ధి మాటను పక్కన పెట్టిన బిజెపి, కులం పేరుతో, మతం పేరుతో, సంప్రదాయం పేరుతో, తినే తిండి పేరుతో వైషమ్యాలను సృష్టిస్తూ తన రాజకీయ పబ్బం గడుపుకుంటోందన్నారు. రాష్ట్రంలో దళితులు ఓట్లకు తప్ప దేనికి పనికి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఆధిపత్య వర్గాల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నా.. వారిని కనీసం పోలీస్ స్టేషన్ మెట్లు కూడా ఎక్కనివ్వకుండా అధికార మదంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రతిపక్ష సహకారం దొరుకుతోందేమో అని ఎదురుచూస్తున్న దళితులకు, పాలనకు సంబంధించి మేమూ ఆ తానులోని గుడ్డలమే అన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పెరిగిపోతున్న ఈ ఆర్థిక, సామాజిక అంతరాలను బద్దలు కొట్టే విధంగా దళితులంతా ఒక్కటై ఐక్యంగా ఎదిరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈనెల 29వ తేదీ విజయవాడలో జరిగే మహా ధర్నా ద్వారా మన శక్తి ఏంటో చూపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు భువనేశ్వరి, గిరిధర్ గుప్తా ,కెవిపిఎస్ మండల కార్యదర్శి పాకాల సుబ్రహ్మణ్యం, ధనమ్మ, రాణి, సుజాత పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ

- ఇద్దరు మృతి -ఒకరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని మొగిలి గ్రామం వద్ద చోటు చేసుకుంది. సీఐ నాగరాజు రావు కథనం మేరకు.. బైరెడ్డిపల్లి మండలం రామన్నపల్లికి చెందిన నారాయణ గౌడ్, వెంకటమణి, శ్రీ రామ్ రెడ్డి ముగ్గురు మిత్రులు ద్విచక్ర వాహనంలో కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల కోసం వెళుతుండగా మార్గమధ్యంలో మొగిలి గ్రామంలో కల మొగిలేశ్వర స్వామి దర్శనార్థం వాహనాన్ని మలుపు తిప్పి రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుండి పలమనేరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ప్రథమ చికిత్స బంగారు పాలెం ప్రభుత్వ ఆసత్రికి చేర్చి చికిత్స చేస్తుండగా నారాయణ గౌడ్, వెంకట మణి పరిస్థితి విషమించి మృతి చెందారు. శ్రీరామ్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్మాన్‌భవను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కార్వేటినగరం: పేదలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం సీహెచ్సీ లో సూపరింటెండెంట్ డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆయుష్మాన్ భవ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్, వంటి వ్యాధులకు ప్రాథమిక చికిత్సతో పాటు ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. జగనన్న మహాభాగ్యం అన్నినినాదంతో ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీలో దాదాపు 90 శాతం వ్యాధులకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరంగా ఉండాలనే

ఆయుష్మాన్ భవ కార్డులు విడుదల చేస్తున్న ఎంపీపీ లత బాలాజి

ఉద్దేశంతో ఈ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీడీవో మోహనమురళీ, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పరంధర్, వైసిపి సీనియర్ నాయకులు ఆమీద్, లోకనాథనాయుడు, పద్మనాభశెట్టి, డాక్టర్ శ్రుతిబార్గవి, డాక్టర్ మురళీ, డాక్టర్ శ్రుతివాణి, పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

పోలింగ్ బూత్‌లు మార్చండి..

టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలంలో సంతబయలు, గొడుగుచింత, ఇనాంకోత్తూరు పంచాయతీల్లో ఎమ్మెల్యే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని శుక్రవారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడిపి నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కార్యాలయంలో అఖిల పక్షం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి, జిల్లా టిడిపి మాజీ కార్యదర్శి పి.మోహన్ మురళి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వినతి పత్రం సమర్పించి సమస్యను వివరిం చారు. కలెక్టర్ స్పందిస్తూ తప్పకుండా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మోహన్ మురళి తెలిపారు. ఈ కార్యక్ర మంలో వెదురుకుప్పం డిప్యూటీ తహశీల్దార్, నియోజకవర్గ టిడిపి నాయకులు చిట్టిబాబు నాయుడు, రుద్రయ్య నాయుడు గుండయ్య, రమేష్, గురప్పనాయుడు పా ల్గొన్నారు.

ఏటిఎం చోరీ కేసులో శిక్ష పడ్డ నిందితులు రవి, షణ్ముగం

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి

అధికారుల సమీక్షా సమావేశంలో ఎంపీపీ

ప్రజాశక్తి - కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రవేశపెట్టిన నాడు-నేను పథకం ద్వారా మంజూరైన పాఠశాలల పనులను అక్టోబర్ ఆఖరిలోపు పూర్తి చేయాలని, ప్రభుత్వం పేదలకు అందించిన పక్కాగృహాలను సామూహిక గృహ ప్రవేశాలకు ముందే పూర్తి చేయాలని, ఎన్ఆర్‌జిఎస్ పనులు నాణ్యతగా చేపట్టాలని సంబంధింత అధికారిని ఆదేశించారు. అరులైన ప్రతి ఒక్కరికీ రైతుభరోసా అందేలా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి నివేదిక అందించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు ప్రతిష్టాత్మకంగా అందించనున్న అసైన్డుమెంట్

మండల అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపి లతబాలాజీ

భూముల పంపిణీలో ఎలాంటి అవక తవకలు లేకుండా చూడాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనంజయవర్మ సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఎంపీడీవో మోహన మురళీ, ఎంఈవో విజయకుమార్,డిటి లక్ష్మిపతి, ఏపీవా జాహ్నవి. ఏపీఎం విజయకుమార్, ఆర్.డబ్ల్యూస్ ఏఈ గిరీష్ కుమార్. అంగన్‌వాడీ పర్యవేక్షకులు ఇందిరా, షామిని అగ్రికల్చర్ ఏవో హేమలత,పలువురు అధికారులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీచేస్తున్న ఆహార భద్రత అధికారులు

ఆహార భద్రత అధికారుల తనిఖీ

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సదుం లోని హోటళ్లు, ఇతర ఆహార తయారీ దుకాణాలను జిల్లా ఆహార భద్రత అధికారులు తనిఖీ నిర్వహించారు. హోటళ్లలో ఆహార తయారీకి ఉపయోగించే వంట నూనెలు, ఇతర వస్తువులను తనిఖీ నిర్వహించి వాటి శాంపిల్స్ ను తీసుకున్నారు. జిల్లా ఆహార భద్రత అధికారి నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను హోటళ్ల యజమానులు, స్వీట్ స్టాల్ నిర్వాహకులు, మాంసం దుకాణదారులు తప్పక పాటించాలని చెడిపోయిన పాడైన వస్తువులను వినియోగించరాదని కోరారు. ప్రతి ఒక్క దుకాణాదారులు లైసెన్స్ తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

ఏటిఎంలో బ్యాటరీ చోరి

నిందితులకు జైలు శిక్ష

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చాల సంవత్సరాలుగా కొన్ని కేసులకు సంబందించిన నిందితులకు ఎన్‌బిడబ్ల్యు జారీ చేసి బంగారు పాళ్యం పోలీసులు పిఎఎస్‌జే చిత్తూరులో హాజరుపరిచారు. 2022 వ సంవత్సరంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటిఎం లో బ్యాటరీ చోరీ చేసిన నిందితుడిని ప్రిన్సిపాల్ సివిల్ సెషన్ జడ్జి ఎదుట బంగారుపాళ్యం పోలీసులు హాజరుపరిచారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న ఎన్‌బిడబ్ల్యూ ను పునఃసమీక్షించే క్రమంలో సి.రవి పలు కేసులలో నిందితుడై ఉన్నాడు. ఇతను 2016వ సంవత్సరం నుంచి పరారిలో ఉన్నాడు. ఇతనిని పట్టుకునేందుకు బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ జి.వి.నగరాజ రావు ఆధ్వర్యం లో, బంగారుపాళ్యం ఎస్ఐ శ్రీ రాం భూపాల్, సిబ్బందితో ఒక ప్రత్యేక బృందం ఏర్పరిచి సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో నిందితుడిని తిరుపతి జిల్లా లో బంగారుపాళ్యం పోలీసులు ఎన్‌బిడబ్ల్యూ జారి చేసి పిఎఎస్‌జే (ప్రిన్సిపాల్ అసిస్టెంట్ సెషన్ జడ్జ్) కోర్ట్, చిత్తూరు లో శుక్రవారం హాజరు పరిచారు. 2022వ సంవత్సరంలో కె.జి.సత్రం లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటిఎం లో బ్యాటరీ చోరీ చేసిన రవి , షణ్ముగం ను ప్రిన్సిపాల్ సివిల్ సెషన్ జడ్జి ఎదుట హాజరపరచగా అతనికి 1 సంవత్సరం3 నెలలు జైలు శిక్ష విధించారు.

క్రైమ్ పోలీసులు అరెస్టు చేసిన పాత నేరస్తుడు తొండ మొగలాల

పాత నేరస్తుడు తొండ మొగలాల అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పెడింగ్ కేసుల పరిష్కారంలో చిత్తూరు క్రైమ్ పోలీసులు ఈస్టు గోగావరి జిల్లాకు చెందిన పాత నేరస్తుడు తొండ మొగలాలను అరెస్టు చేసి చిత్తూరు పిఎఎస్ కోర్టులో శుక్రవారం హాజరు పరిచారు. పలు నేరాల్లో నిందితుడి తొండ మొగలాల ను అరెస్టు చేసేందుకు ఈస్ట్ గోదావరి జిల్లా గోకవారంలో చిత్తూరు క్రైమ్ పోసుల టీమ్ అదుపులోకి తీసుకుంది. ఏడు సంవత్సరాలుగా నిందితుడు పోలీసుల కంటపడకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. చిత్తూరు, నెల్లూరు, నాయుడుపేట, తిరుపతి, మదనపల్లి ప్రాంతాల్లో పలు నేరాలకు పాల్పడిన్నట్లు పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. పిఎఎస్‌జే ప్రిన్సిపాల్ అసిస్టేట్ సెషన్ జడ్జి నేరస్తుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

రోజాకు రాజకీయ భిక్ష పెట్టిందే టిడిపి: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): నగరి ఎమ్మెల్యే , మంత్రి రోజాకు రాజకీయ భిక్ష పెట్టింది టిడిపి అని, పార్టీ క్యాడర్ కు నిరంతరం క్రమశిక్షణను బోధించిన చంద్రబాబునాయుడుపై, లోకేష్ పై మంత్రి రోజా వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకముందు రోజా ఆర్థిక పరిస్థితి ఎలా వుందో మంత్రి అయ్యాక రోజాకు ఇంత ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందో ఆ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అన్నారు. క్వారీలు మూయించి, ఇసుక మాఫియాను నడిపిస్తూ కోట్లకు పడగలెత్తిందన్నారు. అలాంటి వ్యక్తి రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమించే చంద్రబాబుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మంచిది కాదని, ఇదే పరిస్థితి పునరావృతం అయితే తెలుగు యువత తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందన్నారు. చంద్రబాబుపై అక్రమ ఆరోపణ కేసులు షేల్ కంపెనీల నుండి ఎవరి ఖాతాల ద్వారా చంద్రబాబుకు నగదు చేరిందో ముఖ్యమంత్రి బయట పెట్టాలన్నారు. నందమూరి బాలకృష్ణ ఎమ్మెల్యేగా కరోనా సమయంలో తన హిందూపురం నియోజకవర్గానికి హాస్పిటల్ నిర్మించి ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఎంతోమందికి ప్రాణదానం చేశారన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా వేలాదిమంది రోగులకు ఉచితంగా చికిత్స అందిస్తూ సేవలు చేస్తుంటేఆయనపై విమర్శలు చేయడం మంత్రి అంబటికి తగదన్నారు. 2024 ఎన్నికల తర్వాత వారి పరిస్థితి అయోమయమేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు ఆనంద్ గౌడ్, ఆర్ పి శ్రీనివాసులు, రాఘవ, చరణ్ చౌదరి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష తనిఖీ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాకా తోపు , పాతపేట లోని టీఎస్ అగ్రహారం సచివాలయ పరిధిలోని గడ్డూరు గ్రామం, కాకా తోపు లో సబ్ యూనిట్ అధికారి జయశంకర్ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో కాకా తోపు పరిధిలో ఈనెల 30వ తేదీ జరిగే మెడికల్ క్యాంపు, 17వ తేదీ మెడికల్ క్యాంపు లు నిర్వహిస్తారని ప్రతి ఏఎన్ఎం తప్పనిసరిగా ప్రతి గృహాన్ని సందర్శించి ప్రతి ఒక్కరికి బిపి, షుగరు, యూరిన్ పరీక్షలు, రక్త పరీక్షలు చేసి వాటి నివేదికలను యాప్ లో అప్లోడ్ చేయాలని వారికి సూచించారు. ఇందులో దీర్ఘకాలిక వ్యాధులు, నరాలకు సంబంధించిన వ్యాధులు, కంటికి సంబంధించిన వ్యాధులు క్షుణ్ణంగా పరీక్ష చేసి వారిని మెడికల్ క్యాంపునకు వచ్చేలా స్లిప్పు ఇవ్వాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు తప్పకుండా క్యాంపు స్థలం రిఫరెన్స్ స్లిప్పులను

తప్పకుండా తీసుకుని రావాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే పాటించాలని ఇంటి లోపల ఇంటి బయట మంచినీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, మలేరియా డెంగ్యూలేని పలమనేరు మున్సిపాలిటీగా తీర్చిదిద్దుటలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వహించాలని ప్రజలకు సూచించారు. మెడికల్ క్యాంపునకు ఏదైనా సందేహాలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం సుజాత, సుభాషిని, ఆశా వర్కర్లు నీలా, పద్మమ్మ, , జగదీశ్వరి పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి 27మంది ఎంపిక

ప్రజాశక్తి-నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ 29వ బెటాలియన్ సుబేదార్ బాలకృష్ణ, బహదూర్ పర్యవేక్షణలో కళాశాల ఎఎన్‌వో లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో 27 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, అందులో ఉన్నవారు జాతీయ సేవకు సిద్ధంగా ఉండే బాధ్యతాయుత పౌరులన్నారు. ఎన్‌సీసీలో ప్రవేశాన్ని విద్యార్థులు గర్వంగా భావించాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ప్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల అవరణంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి పాదయాత్రల సందర్భంగా ఇచ్చి హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్న అమలు చేయాలన్నారు. సిపిఎస్ ను వ్యతిరేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతాదేవి,

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సురేంద్రబాబు, సురేష్, వినోద్, గీతా, రాజేష్, గాంధీలు పాల్గొన్నారు.

25న ఛలో విజయవాడకు సహకరించండి

పీడీకి యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25వ తేది ఆదివారం ఛలో విజయవాడకు సహకరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీని కలసి వినతి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు షకిల, ప్రేమ, మమత, సుజని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కరం కోసం ఉమ్మడిగా అన్ని యూనియన్లు కలసి ఈనెల 25వ తేది ఛలో విజయవాడ నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. రాష్ట్రా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలను బంద్ చేసి ఛలో విజయవాడకు తరలి రావాలని పిలుపునిచ్చారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చంద్ర బాబు అరెస్టుకు

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-నగరి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నగరిలోని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు రావూరి పురుషోత్తం ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టిడిపి లీగల్ సెల్ అధికార ప్రతినిధి కే సోమసుందరం, చిత్తూరు పార్లమెంటరీ టిడిపి లీగల్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. జె జగదీష్, మహాదేవన్. మహేష్. ధరణి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూతో సుజన్ లైఫ్ సైన్సెస్ సహకార ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంతో సుజన్ లైఫ్ సైన్స్ సంస్థ శుక్రవారం పరస్పర అంగీకార ఒప్పందం చేసుకుంది. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి, సుజన్ లైఫ్ సైన్స్ వ్యవస్థాపకుడు డా. దామోదరరెడ్డి లు పరస్పర అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. ఎం ఓ యు ప్రకారం రెండు సంస్థలు లైఫ్ సైన్స్ రంగంలో సేఫ్టీ డ్రగ్ టెస్టింగ్, డ్రగ్ డిస్కవరీ రీసెర్చ్ , ఫార్మాసూటికల్స్, బయోటెక్నాలజీ, యనిమల్ మోడల్ డిసీజస్, స్టూడెంట్ రీసెర్చ్ వంటి అంశాలపై రెండు సంస్థలు పరస్పరం సహకారం అందించుకుంటాయని విసి అన్నారు. ఎస్వీయూ పూర్వ విద్యార్థి అయిన సుజన్ లైఫ్ సైన్స్ సంస్థ యజమాని యన్ ఆర్ ఐ గా 35 సంవత్సరాల ఫార్మారంగ అనుభవాన్ని కలిగివున్నారని , 2006 లో తిరుపతిలో స్థాపించిన సంస్థతో ఒప్పందం లైఫ్ సైన్స్ లో మరిన్ని పరిశోధనా సౌక ర్యాలను అందిస్తుందని ఉపకులపతి అన్నారు. ఈ కార్యక్రమంలో

ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ , డీన్లు ఆచార్య అప్పారావు, ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య ఎస్. విజయభాస్కరరావు , ఆచార్య కిషోర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ధర్నా

ప్రజాశక్తి -తిరుచానూరు: ఎస్‌సి వర్గీకరణ బిల్లును పార్లమెంట్ లో అమోదించాలంటూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఎస్ఎఫ్ నాయకులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్నో ఏళ్లతరబడి పోరాట పటిమతో కొనసాగిస్తున్న తమ శ్రమను గుర్తించి వర్గీకరణ అమోదం తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగలకు తగు న్యాయం జరగలేదని అవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఎస్సీ వర్గీకర ణకు ఆమోదం తెలిపి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు పెంచుల య్య, గోపి, ఎంఎస్ఎఫ్, ఎంఎస్‌పి నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని స్టాంపులు

- తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-తొట్టంబేడు: తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అన్ని రకాల స్టాంపులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని సబ్ రిజిస్ట్రార్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపులు అందుబాటులో లేవనీ, ప్రజలు పడిగాపులుగాస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దే ఈ-స్టాంపుల విక్రయ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒకటి కొన్నా, పది స్టాంపులు కొన్నా గానీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.50 యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. యూజర్ చార్జీల భారం ఎత్తివేయాలని కోర్టులో ప్రజా వ్యాజ్యం దాఖలైందని, తీర్పు వచ్చే వరకు ప్రజలు సహకరించాలని కోరారు.